# బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచారు



వివరాలు మెయిన్ లో...



ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 02 జులై , 2025 | పేజీలు :08


## పెండింగ్ తాగు నీటి ఇంట్రా పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** జిల్లాలో చేపట్టిన పెండింగ్ త్రాగు నీటి ఇంట్రా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మిషన్ భగీరథ ఇంట్రా త్రాగునిటి సరఫరా పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.అంతర్గం, పాలకుర్తి, మంథని, కమాన్ పూర్, ముత్తారం, రామగిరి మండలాల్లోని గ్రామాల్లో పెండింగ్ ఉన్న ఇంట్రా మిషన్ భగీరథ పనులకు సంబంధించి చేపట్టిన పనుల పురోగతి వి వరాలను కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మా ట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో పెండింగ్ ఉన్న ఇంట్రా మిషన్ భగీర థ పనుల పూర్తి కు దృష్టి సారించాలని అన్నారు. ఫిబ్రవరి నెలలో మంజూరు చేసిన ఇంట్రా పనులు ఇంకా పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులలో ఇండ్లకు పైప్ లైన్ ద్వారా త్రాగు నీరు చేరేలా చూడాలని అన్నారు.కాంట్రాక్టర్ లో వెంటపడి పనులు త్వరగా అయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు పనుల పురోగతి పై ఇంజనీరింగ్ అధికారులు రివ్యూ చేపట్టాలని అన్నారు. మంథని ప్రాంతంలో త్రాగునీటి సరఫరా లో ఉన్న ఇబ్బందులు గురించి గ్రామాల వారీగా నివేదిక తయారుచేసి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపెల్లి జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి సరఫరా కాకుండా పాత గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల జాబితా తయారు చేసి వాటి పునరుద్ధరణ అవకాశాల పై రిపోర్ట్ అందించాలని అన్నారు.వర్షాకాలం నాలుగు నెలల పాటు నీటి నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలని అన్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. డ్రైనేజీ సమీపంలో ఉన్న త్రాగునీటి లైన్ల భారీ వర్షాల సమయంలో మిక్స్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టల్స్ లకు సమృద్ధిగా త్రాగునీటి సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి సంక్షేమ హాస్టల్ వద్ద త్రాగునీటి సరఫరా పరిస్థితులను మిషన్ భగీరథ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు నీటి సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఈఈఈఈఈ మిషన్ భగీరథ ఇంట్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సేవలపై అవగాహన విస్తృతం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్‌లోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించి వారితో పలు ఆటలు ఆడారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. భవిత కేంద్రానికి ఏమైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగుల మనోవికాస అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. అవసరమైన వారందరికీ స్పీచ్ థెరపీ ఇప్పించాలన్నారు. అనంతరం భవిత కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు

వివరాలు మెయిన్‌లో..

# ప్రభుత్వ పాఠశాలల్లో సెల్‌ఫోన్ల వాడకం..

### చర్యలు తప్పవన్న ఎంఇఒ

**ప్రజాపక్షం/- ఎడపల్లి:**ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేదిస్తూ ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించినప్పటికీ ఎడపల్లి మండలంలోని కొందరు ఉపాధ్యాయులు వాటిని విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని వల్ల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గి, పాఠశాలల ప్రతిష్ట మసకబారుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు యధేచ్ఛగా సెల్ ఫోన్లు వాడుతుండటం వల్ల విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ముఖ్యంగా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పడిపోయినప్పటికీ, కొందరు ఉపాధ్యాయుల తీరు మారడం లేదు. పాఠశాల సమయంలో విద్యార్థులకు బోధించాల్సిన ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లలో ముచ్చట్లు చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. తమనెవరో అడిగే వారు లేరన్న ధీమాతో అతిగా తరగతి గదుల్లో ఫోన్లను వాడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. మంగళవారం ఎడపల్లి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం బోధించే శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడుతూ ఉండగా అదే సమయంలో చాలా మంది విద్యార్థులు కిటికీల పైన కూర్చొని అల్లరి చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సెల్‌ఫోన్‌లో నిమగ్నమై ఉండటంతో విద్యార్థుల అల్లరిని పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి గాలప్పను వివరణ కొరగా తరగతి గదిలో సెల్‌ఫోన్లు వాడరాదని కచ్చితంగా ఆదేశాలు ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు రాగానే తమ సెల్‌ఫోన్లను ప్రధానోపాధ్యాయులు లేదా జూనియర్ అసిస్టెంట్ లేదా సమానమైన హోదా గల వ్యక్తులకు అప్పగించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకుంటామని గాలప్ప తెలిపారు.





## సంక్షేమ పథకాలకు ప్రతిరూపమే
# కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సంక్షేమ పథకాలకు ప్రతిరూపమే కాంగ్రెస్ ప్రభుత్వం అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.మంగళవారం సుల్తానాబాద్ మండలం లోని నరసయ్య పల్లి గ్రామంలోని గ్రామం గాంధీనగర్ లో మంగళవారం ఇందిర ఇండ్లకు ముగ్గులు పోశారు. 33 లక్షల రూపాయల నిధులతో పలు సిసి రోడ్లకు, మహిళ భవనం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. నరసయ్య పల్లి గ్రామపంచాయతీ వద్ద జరిగిన సభలో నరసయ్య పల్లి, గాంధీనగర్, బొంతకుంట పల్లి, దుబ్బపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ప్రొసీడింగ్స్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల రుణమాఫీ, తిరిగి రుణ సదుపాయం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షలకు పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోల్లు, సన్న వడ్లకు రూ. 500ల చొప్పున బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి అందజేస్తున్నట్టు చెప్పారు. సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను, రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు. తాను కూడా 24 గంటల్లో 18 గంటలు ప్రజల కోసం నిర్విరామంగా పనిచేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకువెళ్లే వీలుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బషీరొద్దీన్,ఎంపీడీఓ దివ్య దర్శన్రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు ,దన్నాయక్ దామోదర్ రావు, సాయిరి మహేందర్,మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్, కల్లేపల్లి జానీ, జూపెల్లి తిరుమల్ రావు,పన్నాల రాములు,వేగోళం అబ్బయ్య గౌడ్, సందీప్ రావు, బల్మూరి వెంకటరమణ రావు, బుచ్చి రెడ్డి, కొమురయ్య,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మేషన్ కాలనీలో మట్టిబాటల ముప్పు

## సిసి రోడ్డు పనుల్లో ఆలస్యం, అదనపు కలెక్టర్ ఆదేశాలను పాటించని అధికారులు

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలంలోని మేషన్ కాలనీలో వర్షం పడితే రహదారులు బురదమయమవుతున్నా, సిసి రోడ్ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఒక్క చినుకు పడితేనే రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గతంలో అదనపు కలెక్టర్ సిసి రోడ్డు నిర్మాణానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, అధికారులు వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండటం నిరాశ కలిగిస్తుంది. పనుల ఆలస్యం వెనుక నిధుల లేమా లేదా సాంకేతిక సమస్యలేనా, లేక అధికారుల నిర్లక్ష్యమా అన్నది స్పష్టంగా తెలియకపోయినా, ప్రజల అవసరాల పట్ల అలసత్వం చూపడం తగదు అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఆదేశాలను అమలు చేయకపోవడం సరికాదని వారు కోరుతున్నారు.





## కాగజ్‌నగర్‌లో దేశీదారు మద్యం పట్టివేత

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యంను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సిఐ వి.రవి తెలిపారు. మంగళవారం మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు వివిధ గ్రామాల దిశగా దేశీదారు మద్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.జ్యోతి కిరణ్ ఆదేశాలతో పట్టణంలో వాహనతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షిఫ్ట్ డిజైర్ కారులో అక్రమంగా తరలిస్తున్న 17 కాటన్ల దేశీదారు మద్యం ను స్వాధీనం చేసుకుని, కారుతో పాటు కౌటాల మండలానికి చెందిన దుర్గం సాయిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.68,000 ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పి.లోభానంద్, కానిస్టేబుళ్లు కుమార్, రాజ్ కుమార్, హుస్సేన్, మండల్ పాల్గొన్నారు.



## కొమురంభీం జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ కోసం జులై 1 నుంచి 31 వరకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పి కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఈ నేపథ్యంలో డిఎస్‌పి లేదా ఆపై స్థాయి అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ఊరేగింపులు, ధర్నాలు, ర్యాలీలు, ప్రజలు గుమిగూడే కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలు లేదా శాంతిని భంగపెట్టే వస్తువులు కలిగి ఉండరాదని హెచ్చరించారు. చట్టానికి విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టినట్లయితే 30 పోలీస్ యాక్ట్1861 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలని సూచించారు.

## కెజిబివిలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/తాండూర్ :** తాండూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్, డే వాచ్ ఉమెన్, స్కావెంజర్, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎం. మల్లేశం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల వయసు మధ్య ఉండాలని సూచించారు. డే వాచ్ ఉమెన్ పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్, స్వీపర్ పోస్టులకు కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణత అవసరమని తెలిపారు. సంబంధిత అర్హత సర్టిఫికెట్లు సమర్పిస్తూ అభ్యర్థులు జూలై 7వ తేదీ సాయంత్రం వరకు మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తులు చేయాలని తెలిపారు.

# విద్యార్థులకు బహుమతులతో ప్రోత్సాహం

## వేంపల్లిలో బ్యాగులు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేసిన సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల




**ప్రజాపక్షం/ సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలంలోని వేంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఉపాధ్యాయ సంఘ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా శ్రద్ధ శుక్ల మాట్లాడుతూ విద్యార్థులు సమాజ భవిష్యత్తు. వారికి స్ఫూర్తిగా చదివే వాతావరణం కల్పించడమే మన బాధ్యత. ప్రతి చిన్న సహాయం కూడా విద్యార్థి జీవితంలో మార్పును తీసుకురాగలదు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ కొమరంభీం జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. విద్యార్థులు ఉత్తమంగా అభ్యసించేందుకు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ టి మండల ఎంఆర్ఓ రహీముద్దీన్, ఎంపిడిఒ సత్యనారాయణ, ఎంఇఒ వేణుగోపాల్, టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షుడు హరీష్, సిఆర్‌పిలు పవన్ కుమార్, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



## వ్యవసాయంలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలి

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ రాజలింగు మోతే అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన ప్రపంచ వ్యవసాయ దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు లేవన్న కారణంగా, ముఖ్యంగా సన్నకారు రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతులు కొనుగోలుదారుల మధ్య ఉండే దళారీ వ్యవస్థను పూర్తిగా తొలగించనంతవరకూ వారికే కాదు, వ్యవసాయ రంగానికే నిజమైన ప్రయోజనం ఉండదని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించినా, రైతులకు ఆదాయ భద్రత ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అందుకే, ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని, అవసరమైతే ఈ వ్యవస్థను ప్రత్యేక యంత్రాంగంగా ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థ నిర్మూలన కోసం మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కుమ్మం సురేందర్, కలువల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ నస్పూర్ :** శ్రీరాంపూర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ సిసిసి. ఆధ్వర్యంలో కరీంనగర్ రేకూర్తికి చెందిన లయన్స్ ఐ హాస్పిటల్ సహకారంతో జూలై 2 బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో కంటి సంబంధిత అన్ని రకాల పరీక్షలు వైద్య నిపుణులైన డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అవసరమైన వారికి మందులు కూడా లయన్స్ క్లబ్ సహకారంతో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఉచితంగా అందించనున్నారు. ఈ శిబిరంలో 50 సంవత్సరాల పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు చేసి, శుక్లాలు లేదా పోరలు ఉన్నవారిని గుర్తించి, ఆపరేషన్ అవసరమైతే జూలై 3న రేకూర్తికి ఉచిత బస్సు ద్వారా తరలించి ఉచిత కంటి శస్త్రచికిత్స నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం ఉచిత భోజన వసతి కల్పించి, తిరిగి మరుసటి రోజు మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌కు ఉచిత రవాణా సౌకర్యంతో చేర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, సెల్ నంబర్, రెండు దుప్పట్లు, ఒక ప్లేటు, గ్లాసుతో రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లయన్ మల్లారెడ్డి వెంకట్ రెడ్డి లక్ష్మి రెడ్డి అధ్యక్షతన, లయన్ రేగుంట చంద్రశేఖర్ సెల్ (9666693932, 8374793932) అధ్యక్షతన, ట్రెజరర్ భీమ్ రెడ్డి రవీందర్ రెడ్డి, సెక్రటరీ సూరపనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

## మందమర్రి పోలీసుల ప్రతిభకు ప్రజల ప్రశంస

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఏడు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామని సిఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మందమర్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులను రక్షించడం, నేరాల నిరోధం చేయడం పోలీసుల ప్రాథమిక బాధ్యత. రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డిసిపి మార్గనిర్దేశంలో ప్రతి స్టేషన్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సిఇఐఆర్ ఫిర్యాదులను సమర్థంగా పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటివరకు మందమర్రి స్టేషన్ పరిధిలో 280 ఫిర్యాదులు నమోదు కాగా, అందులో 197 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని, మిగిలిన వాటిని కూడా త్వరలోనే రికవరీ చేస్తామని తెలిపారు. డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఓ భాగం. దాన్ని పోగొట్టుకున్నప్పుడు ప్రజలు అనుభవించే ఆవేదనను మేం అర్థం చేసుకుంటామని, అందుకే టెక్నాలజీని ఉపయోగించి వారికి వేగవంతమైన సేవలు అందించడమే మా లక్ష్యం అని ఆయన అన్నారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే సంబంధిత మొబైల్ ఫోన్ ఐఎంఇఐ నంబర్ బ్లాక్ అవుతుందని, దాంతో ఆ ఫోన్ దేశంలో ఎక్కడా నెట్‌వర్క్‌లో పనిచేయదని పేర్కొన్నారు. ఇది దొంగలకు ఉపయోగించలేని పరిస్థితిని కలిగించడమే కాక, ఫోన్ రికవరీ ప్రక్రియను సులభతరం చేస్తుందన్నారు. తాము తిరిగి పొందిన మొబైల్ ఫోన్లను అందుకున్న బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ, మందమర్రి పోలీసుల సేవలపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రత, ఆస్తుల పరిరక్షణే తమ ధ్యేయమని పోలీసులు తెలిపారు. మొబైల్ రికవరీలో కీలకపాత్ర పోషించిన సిబ్బందిని సిఐ అభినందించారు.

## ఇండ్ల పట్టాలపై పోరాటాన్ని తప్పుబట్టడం దురదృష్టకరం



**ప్రజాపక్షం/మంచిర్యాల :** పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని నిరంతరం పోరాటం చేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లిపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్ తెలిపారు. మంగళవారం బిజెపి మంచిర్యాల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి స్థలాల్లో శాశ్వతంగా నివసిస్తున్న కుటుంబాలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్న డిమాండ్‌ను గత ఐదు సంవత్సరాలుగా రఘునాథ్ నేతృత్వంలో బిజెపి ముందుంచి కలెక్టర్ కార్యాలయం, శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం ఎదుట అనేకసార్లు బాధితులతో కలిసి ఆందోళనలు చేపట్టామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిజెపి పోరాటం వల్లనే కొంత మందికి పట్టాలు లభించాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే పెండింగ్ లో ఉన్న ఇండ్ల పట్టాలను వెంటనే పంపిణీ చేస్తామన్నారు. కానీ ఇప్పటికే 18 నెలలు గడిచినా ఎంఎల్‌ఎ నుంచి ఎటువంటి చర్యలు కనిపించలేదు. నిన్న బిజెపి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించేందుకు బాధితులు వెళ్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. అదేరోజు ధర్నా అనంతరం ఎంఎల్‌ఎ దిగి వచ్చి త్వరలో పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. హామీలు ఇచ్చే బదులు తక్షణమే పట్టాలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. రఘునాథ్ వెరబెల్లి పై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపైనే దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బోయిని హరి కృష్ణ, కుర్రే చక్రి, రాకేష్ రెన్వ, మెరేడికొండ శ్రీనివాస్, ముదాం మల్లేష్, బోయిని దేవేందర్, కొండ వెంకటేష్, అర్జకొండ శ్రీనివాస్, దేవరకొండ వెంకన్న, చిరంజీవి, రాచకొండ సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, కట్కూరి తిరుపతి, జాడి తిరుపతి, శ్రీనివాస్, మిరుదొడ్డి సతీష్, మల్కా రాజేష్, కోరేపు మహేందర్ పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

## ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం విమర్శించారు.నిర్మల్ పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు,మౌలిక సదుపాయాలు,ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు కూలిపోవడం,వర్షాలకు పై కప్పులు కారడం వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు.వెంటనే విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించాలని,ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని రఘురాం డిమాంగ్ చేశారు.అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా కన్వీనర్ కైలాష్,జశ్వంత్,కిరణ్,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్:**మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన లోన్కరి మల్లయ్యకు రూ.15,000, సాయి కిరణ్‌కు రూ.12,500, చేడ్వాయి గ్రామానికి చెందిన గోబిర సుగుణకు రూ.50,000, పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన తోట మధుకర్‌కు రూ.15,500 సిఎం సహాయనిధి చెక్కులు మంగళవారం అందజేశారు. అనారోగ్యం కారణంగా ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు మంజూరైన ఈ చెక్కులను దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని సిర్పూర్ ఎంఎల్‌ఎ డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశించినట్లు బిజెపి మండల అధ్యక్షుడు కుకుడే రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిజమైన సేవ అందించడమే తమ ఉద్దేశమని, సహాయనిధిని దుర్వినియోగం కాకుండా ప్రత్యక్షంగా లబ్ధిదారులకే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు గణపురం నాగన్న, జున్గరి మధుకర్, జునుగరి ప్రభాకర్, సాయిరి సాయికృష్ణ, బండి ప్రభాకర్, పల్లెం పురుషోత్తం, వైకుంఠం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అనూహ్యస్పందన..

**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ప్రత్యేక అధికారి రచ్చ రవీందర్,ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు తమ తమ సమస్యలతో అధికారులకు విన్నవించుకోగా సావధానంగా విన్న అధికారులు రేషన్ కార్డులకు సంబంధించి ఉచిత గృహ లక్ష్మి ,నూతన వంట గ్యాస్, భూభరతి,పోడుభూములకు సంబంధించి 86 దరఖాస్తులు రాగా 15 మంది లబ్ధిదారులకు అక్కడికక్కడే పరిష్కరించారు.మిగతా కొన్ని పరిష్కరించని దరఖాస్తులను అతి త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రాజ్వీర్,తహసిల్దార్ ఎమ్ ఏ.కలీం,ఎంపీఓ లక్ష్మ ణ్,ఆర్ఐ నాగరావు, మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి, విద్యుత్ శాఖ ఏఈ నాగభూషణ్,ఏపీవో వసంత రావు,పంచాయతీ సెక్రటరీలు ఆయా శాఖలకు సంబంధించిన అధికారుల బృందం లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నివారణ మనందరి బాధ్యత

## నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి

**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:**మాదకద్రవ్యాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి అన్నారు.శనివారం రోజు మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, వాటిని అరికట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేసేలా విద్యార్థులు వేసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్సై లింబాద్రి బహుమతులు అందజేసి అభినందించారు.పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిద్ధ పద్మ,ఉ పాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భవిష్యత్తు తరాలను మాదకద్ర వ్యాల బారి నుండి రక్షించడానికి అందరూ కలిసి పనిచేయాలని ఎస్సై లింబాద్రి పిలుపునిచ్చారు.

# గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

## పాల్గొన్న అన్ని లైన్ డిపార్ట్‌మెంటుల అధికారులు



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** గిరిజన మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం పి.యం. ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ మరియు జన భగీధరి అభియాన్ పథకం క్రింద మండల కేంద్రంలోని మద్దిమల్ల తండాలో మంగళవారం రోజున గిరిజనుల వికాసానికి సామాజిక ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాల గూర్చి అన్ని లైన్ డిపార్ట్‌మెంటుల ద్వారా అవగాహనా సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదార్ కార్డు, వికలాంగుల పెన్షన్, వృద్ధాప్య పెన్షన్లు మొదలగునవి అర్హులైన వారి నుండి ధరకాస్తులను స్వీకరించారు. ఇట్టి అవగాహన సదస్సుకు డిటీడీఓ, జీఎం డీఐసీ, ఎంపీడీఓ, ఎంఆర్ఓ, వ్యవసాయ శాఖ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటు, డిఆర్‌డిఏ, ఏఎంసీ చైర్మన్, తెలంగాణా గ్రామీణ బ్యాంక్ మేనేజర్, ఐసీడీఎస్ ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బ్రహ్మాణ్ గావ్ ఎత్తిపోతల పథకానికి నిధుల మంజూరు

## ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్..

**ప్రజాపక్షం/భైంసా:** బ్రహ్మాణ్ గావ్ ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకు 5 కోట్ల 88 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు.అప్పట్లో 2013వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6100 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా 80 కోట్లతో పనులు పూర్తి చేస్తే,గత పాలకుల నిర్లక్ష్యం వైఖరి మూలంగా రైతాంగానికి చుక్క సాగునీరు అందలేదన్నారు.ఎత్తిపోతల పరికరాలు,ట్రాన్స్ఫార్మర్లు,ఎత్తుకెళ్లడంతో మరమ్మత్తులకు నిధులు ఇవ్వాలని పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు.పథకం పనులకు పరిశీలించి పూర్తి నివేదిక ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు.అసెంబ్లీలో పారుదల శాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఐదు కోట్ల 88 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు.మరమ్మత్తులు పూర్తయితే రైతుల దశాబ్దాల కల నెరవేరుతుందన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి,ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు,మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు చెప్పారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన 7,200 కోట్ల స్కాలర్‌షిప్,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనియన్) డిమాండ్ చేసింది.2,3,4 తేదీలలో డిగ్రీ,పీజీ,ఇంజినీరింగ్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది.ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవనంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేష్ మాట్లాడుతూ...స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులు పై తరగతులకు వెళ్లాలంటే,ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజు మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయని,దీంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వాలు స్కాలర్‌షిప్,ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్నాయని,ఇందులో భాగంగానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలను,ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు.వెంటనే బకాయిలనువిడుదలచేయాలనిడి మాండ్ చేసిన వెంకటేష్.లేనిపక్షంలో పెద్ద ఎ త్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోపీడీఎస్‌యూజిల్లానాయకులు, రాజ్,న వీన్, వెంకటేష్‌తదితరులు పాల్గొన్నా రు.

# మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం / వాంకిడి:**మద్యానికి బానిసైన వ్యక్తి చెరుకు చేనులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వాంకిడి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్ఐ ప్రశాంత్ వెల్లడించిన వివరాల ప్రకారం... బెజ్జూరు మండలంలోని రేచిని గ్రామానికి చెందిన వడై వెంకటి (40) అనే వ్యక్తి, వాంకిడి మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన తానుబాయిని వివాహం చేసుకున్నాడు. వివాహానంతరం వ్యవసాయం చేస్తూ జీవించాలనే ఉద్దేశంతో భార్య గ్రామమైన నార్లాపూర్‌కి వచ్చి స్థిరపడ్డాడు. అయితే ఇటీవల మళ్లీ మద్యానికి బానిసైన వెంకటి ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడుతుండేవాడు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో వాంకిడికి వెళ్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. అదే గ్రామానికి చెందిన వడై సంతోష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం పొలంలో పని చేయడానికి వెళ్లగా చెరుకు చేనులో వేపచెట్టుకు చీరతో ఉరేసుకుని ఉండటాన్ని గమనించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని గుర్తించగా ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వెంకటి అని గుర్తించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తానుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి

## ఎసిఎంఓ ఉద్ధవ్ కుమార్




**ప్రజాపక్షం / తిర్యాణి :**విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఏసిఎంఓ ఉద్ధవ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంతన్ పల్లిలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలనతో పాటు అంకితభావంతో విధులు నిర్వహించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రత్యేకంగా గిరిజన ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలకు విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, శిశు బెంచిలను పంపిణీ చేశారు. అలాగే పాత దంతన్ పల్లి పాఠశాల ఉపాధ్యాయుడు లచ్చు పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఇఆర్‌పి కైలాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మొక్కలతోనే ఆహ్లాదకరమైన వాతావరణం..

## ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి..



**ప్రజాపక్షం/ముధోల్ :**మొక్కలతోనే పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని మండలంలోని అష్టా గ్రామ రామాలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి అన్నారు.ఇటీవల నిర్మించిన రామాలయంలో మంగళవారం ప్రాంగణం చుట్టూ ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి,కమిటీ సభ్యులతో కలిసి పూల మొక్కలు నాటారు.ఆలయ ప్రాంగణం పూల మొక్కలతోనే అన్ని జీవరాసులకు పరిశుభ్రమైన గాలి,వాతావరణం లభిస్తుందని అన్నారు.రామాలయ నిర్మాణంలో గ్రామస్తులు చూపిన ఐక్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యంగా మొక్కలు నాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,గ్రామస్తులు మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి చేరిక



ప్రజాపక్షం/ఖానాపూర్ : విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మస్కాపూర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవ) ప్రధాన కార్యదర్శి చిలుకూరి రాములు పిలుపునిచ్చారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజున మేవ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.అనంతరం గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించారు.565 మార్కులతో మొదటి స్థానం సాధించిన కట్టికోల శ్రీవల్లికి,564 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన జూజారే రాజుకు చెరో రెండు వేల పదహారు రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.ఈ సందర్భంగా చిలుకూరి రాములు మాట్లాడుతూ..విద్య ద్వారానే జీవితంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు,మేవ కోశాధికారి బలగం రాజన్న,సభ్యులు అంబటి గంగన్న,చిలుకూరి విజయ్ ప్రకాష్,చిలుకూరి వెంకట రాములు,సి.హారిక,మిలరపు భూమన్న,వెన్నం అంజయ్య,తొంటి శంకర్,జాడి శ్రీనివాస్,కుర్ర శేఖర్,షేక్ ఇమ్రాన్,శోభారాణి,పుప్పాల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్ షెడ్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఏరియా వర్క్ షాప్ లో దాదాపుగా అన్ని సెక్షన్ల లో వర్షం వస్తే వర్క్ షాప్ అంతా వర్షం నీటితో నిండి ఉంటుందని, దీని వల్ల పని చేసే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం వెంటనే ఏరియా వర్క్ షాప్ లో షెడ్ లు రిపేర్ చేయాలని ఏఐటియుసి వర్క్ షాప్ కార్యదర్శి బలుసు రవి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. వర్క్ షాప్ షెడ్ లు రిపేర్ చేయాలని ఎన్నో సార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళిన ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. వర్క్ షాప్ లో వర్షం వచ్చినప్పుడల్లా కార్మికులు విధులు నిర్వహించడం లో ఇబ్బందులు పడుతున్నారని గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల కార్మికులు వర్షం వచ్చినప్పుడల్లా అనేక ఇబ్బందులు పడుతున్నారని, మెటీరియల్ తడుస్తుందని, వెంటనే యాజమాన్యం స్పందించి ఏరియా వర్క్ షాప్ కు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

## జీవితంలో పదవీ విరమణ ఓ భాగం



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2&2ఎ ఇంక్లైన్ లో సేఫ్టీ కమిటీ లో ఏఐటియుసి వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వహించి,ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీ జఫ్రుల్లాఖాన్ 37 సంవత్సరాలు కంపెనీ సర్వీస్ పూర్తి చేసుకుని పదవి విరమణ చేసిన సందర్భంగా మంగళవారం గనిపై ఏఐటియుసి పిట్ కమిటి ఆధ్వర్యంలో జఫ్రుల్లా ఖాన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను పాల్గొని పదవి విరమణ శుభాకాంక్షలు తెలపడం తో పాటు వారి శేష జీవితం ఆరోగ్యం గా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిడికె 2&2ఎ ఇంక్లైన్ పిట్ కార్యదర్శులు పోన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న తో పాటు మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 7న ఎంఆర్పిఎస్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి మండల ఇంచార్జి అంబాల నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో మంగళవారం మాదిగల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థలో అణగారిపోయిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం సామాజిక చైతన్యమై అంతిమంగా మహాజన సమూహంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మందకృష్ణ మాదిగ మొదలుపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించిందని అన్నారు. (ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించిన నేపథ్యంలో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అన్ని గ్రామాల్లో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె సదానందం, పల్లె విజయ్, పెర్క సంతోష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : దిలావర్ పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమై కళాశాల ప్రగతిని సమీక్షించారు.ఇప్పటివరకు కళాశాలలో 173 అడ్మిషన్లు నమోదు కావడం పట్ల ప్రిన్సిపల్,అధ్యాపకులను పరుశురాం అభినందించారు.మరిన్ని అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని వారికి సూచించారు.ఈ సమావేశంలో పరుశురాం మాట్లాడుతూ..జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జెఈఈ,నీట్,క్లాట్ కోసం ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.ఇంటర్మీడియట్ బోర్డు ప్రఖ్యాతిగాంచిన ఫిజిక్స్ వాలా,ఖాన్ అకాడమీతో ఒప్పందం చేసుకుందని,ఈ అవకాశాన్ని పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థి స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇ.సుదర్శన్,కె.జి.ఎం.సి ఆనందం, జైపాల్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ ఎంఇఓగా సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలో విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ గా ఉన్న అంకం ప్రేమసాగర్ సోమవారం రోజున పదవి విరమణ పొందగా నూతన ఎంఈఓగా ఖానాపూర్ మండలం గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్న సంధ్యారాణి నూతన ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకుండా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండే పాఠశాలలను విద్యార్థులకు సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేస్తానని తెలియజేశారు మండలంలో గల పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న ఉపాధ్యాయులకు తెలియజేశారు.పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉపాధ్యాయులు,చూడాలని మారుమూల ప్రాంత పాఠశాలలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసరి నరసయ్య, వాల్గోట్ శీను, బెజ్జూరపు మురళి, గంగాధర్, సిఆర్పీలు సంతోష్, వనిత, కవిత, నౌమని తదితరులు ఉన్నారు.

## ధర్మపురి శ్రీనివాస్‌కు నివాళి



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: నిజామాబాద్ పట్టణ కేంద్రంలో మాజీ పీసీసీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ విగ్రహానికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాళులు అర్పించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

## చదువు మానేసిన వారికి సువర్ణావకాశం

ప్రజాపక్షం/ముత్తారం : చదువును మధ్యలో మానేసిన వారికోసం తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా మళ్లీ చదువుకునేందుకు సువర్ణ అవకాశం కల్పిస్తుందని ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఈ.ఓదెలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఆర్థిక పరిస్థితులు,కుటుంబ కారణాలవల్ల పాఠశాల స్థాయిలోనే కొందరు చదువును మధ్యలోనే మానేయడం జరుగుతుందని, అలాగే మరికొందరు పదవ తరగతి పూర్తయ్యాక ఇంటర్ చదువును కొనసాగించలేకపోతున్నారని చదువుకోవాల్సిన వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడంతో చదువుకునే అవకాశం లేదని అలాంటి వారికి తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) మళ్లీ చదువుకునేందుకు సువర్ణ అవకాశం కల్పిస్తుందని 2025 సంవత్సరం 2026 సంవత్సరం విద్యా సంవత్సరానికి గాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడవి శ్రీరాంపూర్ అధ్యయన కేంద్రం ద్వారా ఓపెన్ స్కూల్ విధానంలో 10వ తరగతి, ఇంటర్ లో ప్రవేశాలు కల్పిస్తున్నారని అడ్మిషన్లకు చివరి తేదీ ఆగస్టు నెల 12వ తారీకు 2025 సంవత్సరం అడ్మిషన్ పొందాలనుకునే వారు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల అడవి శ్రీరాంపూర్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఓదెలు సెల్ నెంబర్ ఫోన్ నంబర్ 9866267927 లో సంప్రదించాలని ప్రధానోపాధ్యాయులు ఓదెలు తెలిపారు.

## నేడు ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాపక్షం/బైంసా : నిర్మల్ జిల్లా ప్రజలకు ముఖ్య సమాచారం.జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల బుధవారం బైంసా క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని,ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం కోరింది.

## రాంచందర్‌కు అభినందన



ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ : భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.రాంచందర్ రావుకు బీజేఎల్పీ (బీజేపీ శాసనసభాపక్ష) నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు సహచర ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ,పైడి రాకేష్ రెడ్డి,ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య,అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.నూతన అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పారిశుద్ధ్య కార్యక్రమం



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలో కమిషనర్ ఆదేశాల ప్రకారం 100 రోజుల పారిశుద్ధ్య నిర్వహణ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలలో నిర్వహించు పారిశుద్ధ్య కార్యక్రమం లో భాగంగా స్థానిక డిగ్రీ కాలేజీలోని ప్రభుత్వ మహిళ హాస్టల్లో జెసిబి ద్వారా చెట్లను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ జి మహేశ్వర్‌రెడ్డి. కె చంద్రశేఖర్, జవానులు విష్ణువర్ధన్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు

## సిటీ పోలీసు యాక్ట్ అమలు

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: జగిత్యాల జిల్లాలో శాంతి భద్రతను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల (జులై 1 నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, ప్లబిక్ మీటింగ్‌లు సభలు సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు .

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలేవి?

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై పట్టణాలలోని మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పట్టణాలు, గ్రామాలలో బ్లీచింగ్, విధులలోని డ్రైనేజీల క్లీనింగ్, దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల మందు స్ప్రే చేయడం లాంటివి తప్పకుండా చేయాలని జగిత్యాల జిల్లా వైద్యాధికారులు సూచిస్తున్నారు. జగిత్యాల మండలంలో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా చర్యలు శూన్యం : జగిత్యాల మండలంలోని గ్రామలలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు చేపట్టకపోవడం పై జగిత్యాల మండల ప్రజలు ప్రభుత్వ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మొదలవ్వడంతో జగిత్యాల గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన ముఖ్యమైన పనులైనా నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించడం లేదా దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవడం. దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల మందు స్ప్రే చేయడం. నీటి తొట్టిలు, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం. దోమల నివారణకు నూనెలు చల్లడం. పారిశుధ్య నిర్వహణకు వీధులు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచడం. చెత్తను క్రమం తప్పకుండా సేకరించి, సరైన పద్ధతిలో పారవేయడం లాంటివి చేయడం లేదని ఏదో మొక్కుబడిగా చేస్తున్నారే తప్ప తాగిన చర్యలు తీసుకోకపోవడం పై జగిత్యాల గ్రామీణ ప్రాంతాల ప్రజలు సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేయడం. వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి సమాచారం అందించడం. వైద్య సిబ్బందితో సమన్వయంతో ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకొని, వ్యాధిగ్రస్తులను గుర్తించి, తగిన వైద్య సేవలు అందించడం. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిమందులను అందుబాటులో ఉంచుకొని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇతర చర్యలు కూడా తీసుకోవచ్చు.గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతను కాపాడటం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు.

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల టీఆర్ నగర్ సబ్ స్టేషన్ 33/11 సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కోసం 2 వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంల నుండి 5 గంటల వరకు టీఆర్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని టీఆర్ నగర్, ధరూర్, నర్సింగాపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని అసిస్టెంట్ ఇంజనీర్ డి.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించగలరు కోరారు.

## భూ వివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండల పరిధిలోని కొండగట్టు ప్రాంతానికి చెందిన కాసారపు ఉమా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంది .తన భర్త కాసారపు శ్రీనివాస్ కు బల్వంతాపూర్ గ్రామ శివారులో రెండు ఎకరాల వ్యవసాయ భూమి కలదు. వీరి భూమి దగ్గర ఇదే గ్రామానికీ చెందిన గంగాధర రాజేశం కు కూడా వ్యవసాయ భూమి ఉంది.జూన్ నెల 25 తేదీన రోజున గంగాధర రాజేశం, కాసారపు శ్రీనివాస్ లకు భూమి విషయంలో వాగ్వాదంఏర్పడడం తో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు పరస్పర దాడికి పాల్పడినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. ఇరు వర్గాల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## పేద విద్యార్థులకు షూస్ పంపిణీ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని 2వార్డులో గల ఇండియన్ మిషనరీ పాఠశాలలో పేద విద్యార్థులకు శివసాయి మల్టీ ప్రొడ్యూసర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా షూస్ పంపిణీ చేసారు. పాఠశాల యాజమాన్యం సొసైటీ చైర్మన్, డైరెక్టర్ కమల కు కృతజ్ఞలు తెలియజేశారు. ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కమల, తాదూరి శ్రీమన్నారాయణ, షేర్ హోల్డర్ శ్రీధర్, బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి, లక్ష్మీనారాయణ, సరిత, కనక లక్ష్మి,జి.సరిత, స్వప్న, స్రవంతి, హారతి, లక్ష్మి, కళ్యాణి, రాణి,హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్ ఎత్తివేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఎలాంటి ఆధారాలు లేని తప్పుడు ఆరోపణలు, క్రమశిక్షణ పేరుతో చేసిన సస్పెన్షన్ ఎత్తివేయాలని పిఆర్ టి యు టి ఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు కర్రు సురేష్ డిమాండ్ చేశారు. తనపై చేసిన తప్పుడు ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎం ఎల్ సి శ్రీపాల్ రెడ్డి కి, పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్రశాఖకుసవాలువిసిరారు. పెద్దపల్లి ప్రెస్ భవన్‌లోమంగళవారం మీడియా సమావేశంలో తన అనుచరులతో కలిసి మాట్లాడారు.ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిచేసినఅక్రమాలపై,సంఘానికి అతను చేస్తున్న అన్యాయంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 6 డిఏలు పెండింగ్, పిఆర్సి ఆలస్యం, సర్వీస్ రూల్స్ మూలన పడ్డ సమయంలో సమస్య పరిష్కార దిశగా ప్రయత్నాలు చేయకుండా ఇలా చదువులకు పనిచేసే కార్యకర్తలను సస్పెండ్ చేయటం దౌర్భాగ్యమన్నారు. శ్రీపాల్‌రెడ్డి అవినీతి బాగోతాన్ని అన్ని ఆధారాలతో రాబోయే రోజుల్లో బయట పెడతామని ప్రకటించారు. సంఘం నాయకులు రాజమౌళి, రామన్న, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, కుమార్ రఘుబాబు, సతీష్, అరుణ్ కుమార్, రవి పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు

**ప్రజాపక్షం/మల్యాల :** కులం పేరుతో దూషించిన వ్యక్తుల పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదైన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా వావిలాలపల్లి గ్రామానికి చెందిన మల్యాల ప్రశాంత్ ఓ ప్రైవేట్ కంపెనీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగావిధులు నిర్వహిస్తున్నాడు.జూన్ నెల 27 న మల్యాల గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం భవనం వద్ద సంస్థకు చెందిన సదస్సు నిర్వహిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన బాసోజు గోవర్ధన్, చింతల రాజేశ్వర్ అనే వ్యక్తులు అక్కడికి చేరుకొని మల్యాల ప్రశాంత్ ని కులం పేరుతో దూషించి,బూతులు తిట్టి ,కొట్టినట్లు ఇక్కడ పని చేయడానికి వీలు లేదని బెదిరించినట్లు బాధితుని పిర్యాదు మేరకు ఎస్సి ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## జగిత్యాలలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇస్కాన్ మెట్ పల్లి వారి ఆద్వర్యంలో జగన్నాథ రథ యాత్ర ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సమగ్రతను పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, శాంతి, సమన్వయ భావాలను పెంపొందిస్తాయి అని అన్నారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవాన్ ఆశీస్సులు జగిత్యాల ప్రజలందరిపై ఉండాలని, అందరికీ విజయం చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. జగన్నాథ రథ యాత్రలో అధికసంఖ్యలో పాల్గొని ఆ కృష్ణ భగవానుని కృప కటాక్షములు పొందారని ఇస్కాన్ మెట్ పెల్లి వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు అడువల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అవారి శివ కేసరి బాబు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం ప్రవీణ్, హరే కృష్ణ భక్తులు, మహిళలు, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీలు, వాటర్ బాటిల్లు పంపిణీ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట గ్రామానికి చెందిన యువ నాయకుడు ఆవారి చందు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న చిన్నారుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు తన జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఉపయోగపడే డిక్షనరీలు ,వాటర్ బాటిల్లు అందజేశారు.ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పిల్లల మధ్య నా పుట్టినరోజు జరుపుకోవడం చాలా ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలగజేసిందని సంతోషం వ్యక్తం చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులందరికీ ఉపయోగపడే నిఘంటువులు నీళ్ల బాటిల్స్ అందించడం ఆనందంగా ఉందన్నారు . పిల్లలు పేద ధనిక అనే భేదం లేకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని అందరూ పాఠశాలలో సమానమే అని తెలిపారు .పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మనం ఎక్కడ పుట్టాం ముఖ్యం కాదు భవిష్యత్తులో మనం ఉన్నత శిఖరాలకు చేరామనేది ముఖ్యం అన్నారు.చదువుకు పేదరికం అడ్డు కాకూడదని వినయం విద్య బతకడం నేర్పుతుందని అన్నారు.భీమ సత్యం, బండి విజయ్,మస్పూరి రాజన్న, గర్వందా వెంకన్న,బండారి శ్రీనివాస్ ,గాదం చంద్రయ్య ,పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరా క్రాంతి పథంపై అవగాహన

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో అర్బన్ మండలంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా ఎంపికైన గ్రామ సంఘం పదాధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సెర్ప్ ఇందిరాక్రాంతి పథం యొక్క ముఖ్య ఉద్దేశలు, లక్ష్యాలు, 25 సంవత్సరాల్లో సాధించిన ప్రగతి తదతర అంశాలు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు వివరించడం జరిగింది. సెర్ప్ సిబ్బంది, వి.ఓ.ఏ.ల విధులు బాధ్యతలు, గ్రామ సంఘం యొక్క బాధ్యతలు, గ్రామ సంఘం ద్వారా స్వశక్తి సంఘాల పర్యవేక్షణ, పుస్తకాల నిర్వహణ, కట్టుబాట్లు అమలు, ఉత్తమ గ్రామ సంఘం లక్షణాలు, మహాసభ అధికారాలు, విధులు, ఇ.సి. విధులు, బాధ్యతలు, గ్రామ సంఘం పదాధికారులైన అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి విధులు, బాధ్యతలు, గ్రామ సంఘం సేవలు కమిటిల ఏర్పాటు గ్రామ సంఘం సహాయకుల విధులు, బాధ్యతలు, ఇందిరా మహిళశక్తి పథకం అమలు, లక్ష్యం తదితర అంశాల గూర్చి శిక్షణ ఇవ్వడం జరిగింది. పాలమూరు జిల్లా కి చెందిన పాలమూరు మహా సమాఖ్య రిసోర్స్ పర్సన్ కే. శ్రీలత, ఎస్.సుదరాణి ఇట్టి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇట్టి శిక్షణ తరగతులకు జగిత్యాల మండల ఎపియం వోదేల. గంగాధర్, సి.సి.పి. విద్యాసాగర్, సమాఖ్య అధ్యక్షురాలు దేశవేణి, గంగభవాని, కార్యదర్శి జెమున, కోశాధికారి సుమలత, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్, అన్ని గ్రామాల గ్రామసమాఖ్య పదాధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థ బలోపేతానికి కృషి

### ఎన్జీఓ మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల కిషోర్ రెడ్డి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జన ప్రతిధ్వని వేదిక (ఎన్జీఓ) స్వచ్ఛంద సంస్థ అనుబంధ కమిటీలోని మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా కిషోర్ రెడ్డి నియామకం అయ్యారు. సోమవారం రోజున సంస్థ రాష్ట్ర అధ్యక్షులు బాస మహేష్ మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా జగిత్యాల జిల్లా, మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన ఆకుల కిషోర్ రెడ్డి ను నియమిస్తూ నియామక పత్రం జారీ చేశారు. వీరి నియామకం వెంటనే అమలులోకి వస్తుందని మహేష్ నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ నియామకం సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతకు తాగిన న్యాయం చేయుటకు రాష్ట్రములో జరుగుతున్న అన్యాయాల పై ఎప్పటికప్పుడు చట్టపరమైన సలహాలు సూచనలు తీసుకుంటూ బాధితులకు అండగా నిలవడంతో పాటు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జన ప్రతిధ్వని వేదిక (ఎన్జీఓ) స్వచ్ఛంద సంస్థ బలోపేతానికి ఆశయాల సాధనకు ఎల్లవేళలా కృషి చేస్తానని కిషోర్ రెడ్డి తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు బస్టాండ్ ప్రాంతం లో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడు.మల్యాల ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బస్టాండ్ ప్రాంతం లో గుర్తు తెలియని మృత దేహం ఉందని ముత్యం పేట గ్రామ పంచాయతీ కారోబార్ రాజేశ్వర్ పిర్యాదు చేశారని చెప్పారు.చనిపోయిన వ్యక్తి కి 60 సంవత్సరాల వయసు కలిగి ఉంటాదని,వికలాంగుడని దాదాపు గా 25 సంవత్సరాల నుండి కొండగట్టు ప్రాంతం లో భిక్షాటన చేస్తూ తిరిగాడని స్థానికులు చెబుతున్నారని అన్నారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు.

# సాయిరాం ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా దేవేందర్

**ప్రజాపక్షం/ముత్తారం:**సాయిరాం మండల ట్రాలీ యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షునిగా అల్లం దేవేందర్, ఉపాధ్యాక్షునిగా రాగుల మొగిళి, ప్రధాన కార్యదర్శులుగా కోళ్ల శ్రీను,దుర్శేటి కుమార స్వామిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్టు యూనియన్ సభ్యులు తెలిపారు.ట్రాలీ యూనియన్ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని అన్నారు. ఇక్కడ పెండెం గణేష్, కళ్యాణపు ఉమామహేష్, అమ్ము లక్ష్మన్,నరెడ్ల శ్రీనువాస్,నాయిని సంపత్ తోపాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంపై సమీక్ష

**ప్రజాపక్షం/జమ్మికుంట:**మహాత్మీగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే వన మహోత్సవంపై వెబ్‌సైట్‌లో వచ్చిన మార్పులపై జమ్మికుంట, వీణవంక మండలాలకు సంబంధించినఅధికారులకుఎంపిడివోకార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్ సమీక్షించి అవగాహన కల్పించారు. ఏపిడి కృష్ణ మూడు మండలాలకు సంబంధించిన ఎంపిడివోలు భీమేసు, శ్రీధర్, పుల్లయ్య, ఎంపివోలు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర దేవస్థానంలో లోకాచార్యులు సేవలు అద్వితీయం

### ఉద్యోగంలో పదవీ విరమణ సహజం

### దేవస్థాన చైర్మన్ ఇంగిలె రామారావు

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గత 25 సంవత్సరాలుగా పాచక వృత్తిలో కొనసాగుతున్న వానమామలై లోకాచార్యులు పదవీ కాలం ముగియడంతో మంగళవారం పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆలయ ఈవో కందుల సుధాకర్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్బంగా దేవస్థాన చైర్మన్ ఇంగిలె రామారాము మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి దేవస్థానానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం పూలమాలతో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవికిరణ్, పరమేశ్వర్, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, రాజేందర్, చిరంజీవి, మల్లేష్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, మధూకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, నాగరాజు, ఆలయ అర్చకులు శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్ శర్మ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



# బిజెపి రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టింది..

**ప్రజాపక్షం/మల్లాపూర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టిందని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిట్టాపూర్ ముత్యంపేట గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రసంగాలు ప్రతిజ్ఞలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పాటు పడుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా చిట్టాపూర్ గ్రామంలో నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ జిల్లా డైరెక్టర్ తక్కల్ల నరేష్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నూతిపెల్లి రాజం, సీనియర్ నాయకులు నల్ల బాపురెడ్డి, లక్ష్మారెడ్డి తిరుపతి, రవీందర్, తదితరులున్నారు



# పోగోట్టుకున్న చరవాణి అప్పగింత



**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి పట్టణానికి చెందిన కటకం భూమయ్య వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. కాగా గత నెల 8న తన అండ్రాయిడ్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు వివరాలను సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి చరవాణి ఆచూకీ కనుగొని హెడ్ కానిస్టేబుల్ పులి రవి మంగళవారం బాధితుడు భూమయ్యకు అందించారు.

# సమాజంలో వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైంది..



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె 8 డిస్పెన్సరీలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం డాక్టర్ పి. రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ ఆరోగ్య రంగానికి చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ 1991 జూలై 1న మొదటిసారిగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించామని తెలిపారు. ఆయన పుట్టినరోజును జాతీయ వైద్యుల దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని చెప్పారు. సింగరేణి వైద్యులు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. నస్పూర్, ఆర్‌కె 8 డిస్పెన్సరీల్లో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. డాక్టర్స్ డే సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా నుండి ఉత్తమ డాక్టర్లుగా ఎంపికైన మురళీధర్, లోకనాథ్ రెడ్డిలకు కొత్తగూడెం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం సత్యనారాయణ, డాక్టర్లు మురళీధర్, లోకనాథ్ రెడ్డి, ఆర్‌కె 8 డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి , వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోరుట్ల:** లయన్స్ క్లబ్ జగిత్యాల జిల్లా కోరుట్ల ఆధ్వర్యంలో డాక్టర్స్ డే , పోస్టల్ వర్కర్స్ డే , చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మూడు ప్రముఖ వృత్తులవారిని క్లబ్ తరపున సన్మానించి, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు లయన్ కొమ్ముల జీవన్‌రెడ్డి, కార్యదర్శి లయన్ ఎలేటి లక్ష్మారెడ్డి, ఖజానాదారు లయన్ నల్ల గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ డాక్టర్లు మన ఆరోగ్య రక్షకులు, పోస్టల్ ఉద్యోగులు సమాజాన్ని అనుసంధానించే వారు, చార్టెర్డ్ అకౌంటెంట్లు ఆర్థిక వ్యవస్థలో నైతికతను నిలబెట్టేవారని అన్నారు. వీరిని గౌరవించడం మన లయన్స్ క్లబ్‌కు గౌరవంగా భావిస్తున్నామన్నారు. అనంతరం లయన్ సభ్యులంతాసేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఆర్‌టి గుంటుక సురేష్, జడ్‌సి గంద్ర అజేయుంధర్ రావు, ఆడెపు మధు, అల్లాడి ప్రవీణ్, ఉష కిరణ్, పోతని ప్రవీణ్, మంచాల జగన్, కుందారపు మహేంధర్, నరేంధర్, జలపతిరెడ్డి, గుణాకర్‌రెడ్డి, పడాల నారాయణగౌడ్, రవీంధర్, ఎల్ఎఫ్ఎస్ సత్యనారాయణ, చౌకి రమేష్, వనపర్తి చంద్రం, కెజి కృష్ణ, నాగభూషణ్, డాక్టర్ అనూప్‌రావు, ఐయంఎ ప్రెసిడెంట్ రేగొండ రాజేష్, కట్కం జగదీశ్వర్, గంద్ర అన్వేష్, ముక్క ఇంద్రనీల్, క్లబ్ సభ్యులు, డాక్టర్లు, పోస్టల్ ఉద్యోగులు, చార్టర్డ్ అకౌంటెంట్ పాల్గొన్నారు

**ముత్తారం :** ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బందితో కలిసికేక్ కట్ చేసి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రజలకు విశేష సేవలు అందించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారందరికీ డాక్టర్ డే శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వైద్యునితో పాటు వైద్య సిబ్బందిని ఘనంగా శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** దైవానికి మరో రూపమే వైద్యులు అని లైన్స్ క్లబ్ సుల్తానాబాద్ చైర్మన్ జూపల్లి తిరుమల్ రావు అన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులకు క్లబ్ ప్రతినిధులు జ్ఞాపికలను అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతరత్న, ప్రఖ్యాత డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ,మా సేవల్ని గుర్తించి సన్మానించినందుకు లయన్స్ క్లబ్బును అభినందిస్తూ,కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో జాతీయ చార్టెడ్ అకౌంటెంట్ డే ను పురస్కరించుకొని ఇద్దరు చార్టెడ్ అకౌంటెంట్లు కోమాకుల ఆదిత్య, కొక్కుల్ల శ్రీనివాస్ లను, జాతీయ తపాలా కార్మికుల దినోత్సవం సందర్భంగా తపాలా కార్మికుడు గుర్రం శ్రీనివాస్ గౌడ్ లకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం లయన్స్ 320జి జిల్లా దశాబ్ది ఉత్సవ వేడుకలను కేకు కట్ చేసి క్లబ్ సభ్యులందరూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.క్లబ్ అధ్యక్షులు జూపల్లి తిరుమల్ రావు, జోన్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, పూర్వ అధ్యక్షులు గజభీంకర్ జగన్, దీకొండ భూమేష్, పూసాల సాంబమూర్తి, తమ్మనవేణి సతీష్, రాయల్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే ను పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోని 15 మంది వైద్యులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందించారు.అదేవిధంగా పోస్టల్ వర్కర్స్ డే,చార్టర్ అకౌంట్ డే సందర్భంగా పోస్టల్ కార్యాలయంలో పోస్ట్ మాస్టర్, సిబ్బందిని,సీఏ ఆకాంక్షను సత్కరించారు.అంతకుముందు స్థానిక హనుమాన్ విగ్రహ కూడలిలో జులై 1 కి 320 జి ఏర్పడి పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా డిస్టిక్ గవర్నర్ ఆదేశాలతో లయన్స్ క్లబ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ధర్మపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు మామిడాల రవీందర్, సెక్రటరీ సర్జా రావు,కోశాధికారి పప్పుల శ్రీనివాస్, జోనల్ చైర్ పర్సన్ పిన్న శ్రీనివాస్, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్స్ జక్కు రవీందర్, డా.ఇందారపు రామకృష్ణ,భీమనాతి అశోక్,సాయిని సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు

### వాణి విద్యాలయంలో..

ధర్మపురి పట్టణంలోని శ్రీ వాణివిద్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. వైద్యులు పెండ్యాల మనస్విని, ద్యావల్ల ప్రణవ్ లు వైద్యుల సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎస్.సంతోషి,డైరెక్టర్లు ఎస్.దినేష్,తోట శంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రపంచ డాక్టర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డీలర్ మల్లయ్య ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ వాహినినీ సత్కరించారు. అలాగే పలు ప్రైవేట్ ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామ్మోహన్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, లయన్స్ క్లబ్ ప్రచార కార్యదర్శి మోర సతీష్, తదితరులు ఉన్నారు.




**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే పురస్కరించుకొని సన్మానం చేశారు. నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్, డొంకేశ్వర్ డాక్టర్ శుబాకర్, నందిపేట్ పశు వైద్యాధికారి నితీష్ వర్మలను లయన్స్ క్లబ్ అధ్యక్షులు గంగుల చిన్నయ్య, కార్యదర్శి బ్యాంకు నర్సయ్య, సభ్యులు పిస్క గంగాదర్, సురేష్, జనార్ధన్, గంగాధర్, నర్సయ్య, జగన్ గౌడ్, భూమన్నతదితరులు పాల్గొన్నారు.

# 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు.. భావోద్వేగం..



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** స్నేహానికి వయసుతో నిమిత్తం లేదు.జ్ఞాపకాలకు కాలం అడ్డురాదని నిరూపిస్తూ,సారంగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989–1990 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు.కరుణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్ ఈ అపురూప వేడుకకు వేదికైంది దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.గత 35 ఏళ్లలో తమ జీవితాల్లో జరిగిన విశేషాలను పంచుకుంటూ,ఒకరి కష్టసుఖాలను మరొకరు వింటూ కన్నీటి పర్యంతమయ్యారు.బడి రోజులో తాము ఆడిన ఆటలు,పాడుకున్న పాటలు,చేసిన అల్లర్లు,పంపకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి,వారి ఆశీర్వాదం అందుకున్నారు.గురువులు తమ పాత విద్యార్థులను చూసి సంతోషం వ్యక్తం చేయగా,పూర్వ విద్యార్థులు తమ గురువుల పాదాలకు నమస్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశం పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి,కొత్త బంధాలను ఏర్పరచుకోవడానికి ఒక గొప్ప అవకాశంగా నిలిచిందని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు.ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు తరచుగా నిర్వహించుకోవాలని వారు తీర్మానించుకున్నారు.

## పసుపు రైతుల కల ఎక్కడ నెరవేరిందో అమిత్‌షా చెప్పాలి ?

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పసుపు రైతుల కల ఎక్కడ నెరవేరింది అమిత్‌షా చెప్పాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో భూపతిరెడి దమాట్లాడుతూ జూన్ 29న పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్‌షా పసుపు రైతుల కల నెరవేరిందని సభలో అన్న విషయం తెలిసిందేనని నిజామాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లా పసుపు రైతుల కల ఇక్కడ నెరవేరిందని ఎద్దేవా చేశారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని ఇప్పటికే మూడుసార్లు ప్రారంభించారని, పసుపు రైతులకు బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందన్నారు. ఇంతవరకు పసుపు బోర్డులో కార్యవర్గం లేదని, గతంలో పసుపు రైతులపై ఉన్న కేసులను కేంద్రం ఎందుకు కొట్టివేయలేదని ప్రశ్నించారు. జిల్లాకు పసుపు బోర్డు పేరుపై అమిత్ షా రావటం స్థానిక సంస్థల స్టంటేనన్నారు. పసుపు రైతులను మభ్యపెట్టే ప్రయత్నం బీజేపీ చేస్తుందని జిల్లా పసుపు రైతులు బీజేపీ చెప్పే మాయమాటలు నమ్మరన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. జూలై 4న జరిగే కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే వస్తున్నారని, పార్లమెంట్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎల్‌బి స్టేడియంలో జరిగే సమావేశానికి భారీగా తరలిరావలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్ని విభాగాల అనుబంధ సంస్థల అధ్యక్షులు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కార్యకర్తలు సమావేశానికి హాజరు కావలన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మైనార్టీల అభ్యున్నతికి కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీస్ కమీషన్ చైర్మన్ తారిక్ అన్సారీ సూచించారు. మంగళవారం నగరానికి విచ్చేసిన సందర్భంగా అధికారులు పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో పాటు ఇతర జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. జిల్లాలో మైనార్టీ వర్గాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. మైనార్టీల కోసం ఉద్దేశించిన సంక్షేమాభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చైర్మన్ తారిక్ అన్సారీ అధికారులకు సూచించారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న తోడ్పాటును అర్హులైన మైనార్టీ మహిళలు వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో మైనార్టీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించేలా జిల్లా యంత్రాంగం తరపు న ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్‌ను కోరారు. మైనార్టీలపై దాడులు జరిగిన సందర్భాలలో పోలీసు అధికారులు సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ముస్లిం స్మశాన వాటికలకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మైనార్టీ వర్గాల నుంచి కమీషన్ చైర్మన్ విజ్ఞాపనలు స్వీకరించారు.నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి కృష్ణవేణి పాల్గొన్నారు.

## ఒకరి మరణానికి కారణమైన కేసులో నిందితునికి జైలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో ఒక వ్యక్తి మరణానికి కారణమైన కేసులో నిందితుడికి రెండేళ్ల కారాగార శిక్షతో పాటు 4000 రూపాయల జరిమానా విధించినట్లు నిర్మల్ జిల్లా జడ్జిశ్రీవాణి మంగళవారం రోజు ప్రకటించారు.ఈ ఘటన 2020 లో చోటుచేసుకుంది.వివరాల ప్రకారం 2020లో భామిని(బి) నివాసి త్రయంబక రావు తన మొక్కజోన్న తోట చుట్టూ అడవి జంతువుల నుండి పంటను రక్షించుకునేందుకు జియా వైరును అమర్చి,దానికి విద్యుత్ సరఫరా చేశాడు.ఈ విద్యత్ సరఫరా జంతువులతో పాటు మనషులకు కూడా ప్రమాదకరమని తెలిసినప్పటికీ,అతను ఈ చర్యకు పాల్పడ్డాడు.దురదృష్టవశాత్తు,బామిని(బి) నివాసి అయిన జాదవ్ బాలజీ అనే వ్యక్తి ఆ వైరుకు తగిలి అక్కడికక్కడే మరణించాడు.ఈ కేసులో సాక్ష్యాలను పరిశీలించిన ప్రిన్సిపల డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్ట్ నిర్మల్ జడ్జి శ్రీవాణి,నిందితుడికి 2 సంవత్సరాల జైలు శిక్ష,4000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ,సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.నిర్మల్ పోలీసులు,ప్రాసిక్యూషన్ వ్యూహాత్మకంగా న్యాయ విచారణ జరిపి,నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చూస్తారని తెలిపారు.ప్రజల భాద్రతకు కట్టుబడి ఉన్న పోలీసు శాఖ,నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ,న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్ష్యాలను సమర్పించడంతో నిర్మల్ పోలీసులు కృషి చేస్తున్నారని వివరించారు.నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.వినోద్ రావు,విచారణ అధికారులు ఇన్స్పెక్టర్లు బి.శ్రీనివాస్ రెడ్డి(ప్రస్తుతం డీఎస్పీ), ఎల్. జీవన్‌రెడ్డి (ప్రస్తుతం ఇన్స్పెక్టర,డ్యూటీ ఆఫీసర్లు ఏఎస్ఐ దల్లు సింగ్,ప్రభాకర్ హెచ్‌సి,వినోద్ కుమార్.పీసి,లైజెనింగ్ ఆఫీసర్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్ అధికారిక లోగో ఆవిష్కరణ



**ప్రజాపక్షం/బాసర :** బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్(ఐఈఈఈ) స్టూడెంట్ బ్రాంచ్ అధికారిక లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ లోగోఆవిష్కరణ ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ లోగోను ఆవిష్కరించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్,ఓఎస్‌డి ప్రొఫెసర్ ఇ.మురళీదర్శన్ విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కీలక పాత్రను ప్రశంసించారు.ఈ సందర్భంగా సంస్థ సభ్యత్వం ద్వారా లభించే ప్రయోజనాలను వారు వివరించారు.వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్,డా.నామని రాకేష్(ఫ్యాకల్టీ కౌన్సిలర్),శ్రీ.జి.వంశీ (స్టూడెంట్ బ్రాంచ్ చైర్)లను ప్రత్యేకంగా అభినందించారు.ఐఈఈఈ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద సాంకేతిక ప్రొఫెషనల సంస్థ.ఇది విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానమయ్యే అవకాశాలను,వృత్తిపరమైన నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాలను అందిస్తుంది.అంతేకాకుండా,సాంకేతిక, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం,ద్వారా సమాజానికి సేవ చేసే మార్గాలను అందిస్తుంది .ఆర్థిక సహాయాలు, కెరిర్, మార్గదర్శకత్వం, అవార్డులు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వంటి అనేక ప్రయోజనాలను కూడా ఐఈఈఈ అందిస్తుంది.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్‌లు డాక్టర్ విఠల్,డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్,విభాగాధిపతి డాక్టర్ భావ్‌సింగ్, అధ్యాపకులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గిరిజనులకు(లంబాడీలకు) ఇచ్చిన హామీలు ఏవి?

### ఎస్టీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యానాయక్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఎన్నికల హామీలలో రాజకీయ పార్టీలు గిరిజన, లంబాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్, జాతీయ ప్రధాన కార్యదర్శి తేజావత్ బెల్లయ్యానాయక్ అన్నారు. లంబాడ హక్కుల పోరాట సమితి నంగార బేరి 29వ ఆవిర్భావ విజయోత్సవ మహాసభ మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లయ్య నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లంబాడ హక్కుల పోరాట సమితి నంగార బేరి 1997 జూలై ఆవిర్భవించిందని 28 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న శుభసందర్భంగా విజయోత్సవ మహాసభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల నుండి లంబాడి తండాలను విడదీసి తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలని మేమెంత మందిమో ఇందు కోసం సుధీర్ఘ పోరాటం చేశామని, ఫలితంగా ధర్నాలు, రాస్తారోకోలు, సైకిల్ యాత్రలు పాదయాత్రలు నిరాహార దీక్షలు చేశామన్నారు. అంతిమంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నూతన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 3147 నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసుకుని మా తండాలో మా రాజ్యం లక్ష్యాన్ని సాధించుకున్నామన్నారు. 30 వేల మంది నిరుద్యోగులకు నిధులుఇవ్వాలన్నారు.రాజీవ్ యువ వికాసం పేరుతో గిరిజన కార్పోరేషన్లను నిర్వీర్యం చేసే కుట్రనువిరమించుకోవాలన్నారు.జిల్లాఅధ్యక్షులు మోహన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్‌నాయక్, ఐడీసీయంయస్‌చైర్మన్‌తారాచంద్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ ఆదివాసి చైర్మన్ మాజీ ఎంపీపీ యాదగిరి నాయక్, రమేష్‌నాయక్, చిన్యానాయక్ ఉన్నారు.

## ఉరి వేసుకుని యువకుని మృతి

**ప్రజాపక్షం/సోన్ :**మండలంలోని సాకేర గ్రామానికి చెందిన సారంగ విజయ్(29) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.మృతునికి గత కొన్ని రోజుల నుండి చీము గడ్డలు అవడంతో ఆస్పత్రిలో చూపించిన తగ్గడం లేదని మనస్థాపం చెంది.ఇంటి నుండి బయటకు వచ్చి సూర్య కుటీర్ నందు వేపచెట్టు కొమ్మకు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని.తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన ఎస్సై గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 16 సేవా కార్యక్రమాలు

**ప్రజాపక్షం/ఎడపల్లిః** ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ గ్రామాలలో 16 సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక బస్టాండ్‌లో అల్పాహార వితరణ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పలకలు పంపిణీ చేశారు. ఎడపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అలాగే ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఆంగ్ల భాష బోధనకు ఉపయోగపడే డిక్షనరీలను అందచేశారు. ఈ కార్యక్రమాలు ఎడపల్లి, మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి గ్రామాలలో జరిగాయి. ఈ సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పుష్ప గంగారెడ్డితో పాటు ప్రతినిధులు మెరిసే సూర్య నారాయణ, బంజ శంకర్, కదం ప్రకాష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి చేరిన 150మంది బిఆర్ఎస్ కార్యకర్తలు

**ప్రజాపక్షం/ఎడపల్లిః** బోధన్ పట్టణ మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ నాయకుడు హబీద్ అలీ ఆధ్వర్యంలో మంగళవారం సుమారు 150మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమాక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ పట్టణ కౌన్సిలర్ శరత్ రెడ్డి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

**ప్రజాపక్షం / నందిపేట్ :** డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుమన్ శంకుస్థాపన చేశారు. మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విఠల్ చారి, ముత్తన్న, రమేష్, శివశంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## త్రీ ఫేస్ కరెంటు కోసం..

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామానికి చెందిన విడిసి సభ్యులు మంగళవారం డిఈ రాజేశ్వర్ రావును కలిసి గ్రామానికి గత 50సంవత్సరాల నుంచి ఇప్పటివరకు త్రీఫేస్ కరెంటు లైన్ లేదని డిఈని కలిసి వినతి పత్రం అంజేశారు. డిఇ సానుకూలంగా స్పందించి త్రీఫేస్ కరెంటు లైన్ కోసం ప్రయత్నం చేస్తానని వారు తెలిపారు. అనంతరం విడిసి సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. డిఇని కలిసిన వారిలో మాజీ ఎంపిటిసి ఎల్క రంజిత్, విడిసి అధ్యక్షుడు బీరయ్య, కార్యదర్శి అంకమల శంకర్, కోశాధికారి చిగుర్ల మల్లేష్, బిల్డర్ శంకర్, బోంగిని నవీన్ గౌడ్ ఉన్నారు.



## ఎంపి రఘునందన్ రావును పరామర్శించిన బిజెపి మండల అధ్యక్షులు

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ను పరామర్శించిన ఉమ్మడి మండలాల బిజెపి అధ్యక్షులు, గత మూడు రోజుల క్రితం ఎంపీ రఘునందన్ రావు యశోద ఆసుపత్రిలో కాలుకు చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మనోహరాబాద్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్, తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోచయ్య ముదిరాజ్ తో కలిసి మంగళవారం యశోద ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండారంలో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం..

**ప్రజాపక్షం/బెజ్జంకి:** పిల్లల శారీరక మానసిక అభివృద్ధిని పెంపొందించడానికి ప్రీ ప్రైమరీ పాఠశాల దోహదపడుతుందని జిల్లా ప్రత్యేక అధికారి భాస్కర్,మండల విద్యాధికారి మాహతి లక్ష్మీలు అన్నారు.మంగళవారం మండల పరిధిలోని గుండారం గ్రామంలో ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా వారు హజరై పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తెలిపారు.రానున్న రోజుల్లో పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీ రాములు,హై స్కూల్ హెచ్ఎం నాగవేణి,పూర్వ ఉపాధ్యాయులు రామంచ రవిందర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి,ఎలుక దేవయ్య,సాన వేణు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థినీలు అవగాహన పెంచుకోవాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** మహిళలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని జాగ్రత వహిస్తూ ఆత్మవిశ్వాసం పెంపోదించుకోవాలని షీటీం,భరోసా హైదరాబాద్ శాఖ ప్రతినిధి, సైకలాజికల్ కౌన్సిలర్ చిన్మయా తమ్మారెడ్డి అన్నారు. డాక్టర్ చిన్మయ అందించిన ప్రేరణ పూర్వక ప్రసంగం విద్యార్థులు స్ఫూర్తి పొందారన్నారు. ఈలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపోదిస్తాయన్నారు. మంగళవారం సిద్దిపేట మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్,లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో సైకాలజికల్ కౌన్సిలర్ చిన్మయా తమ్మారెడ్డి ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయిగి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల చిన్ననాటి నుండి లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు ప్రణాళిక బద్ధంగా కృషిచేయాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మనుషులు తమ మనస్సులో నుండి చెడు ఆలోచనలను దూరం చేయాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, టివి,ల్యాప్ టాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. గొప్ప గొప్ప వ్యక్తులందరు కింది స్థాయి నుండి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. కష్టపడకుండ ఫలితం దక్కదన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తాను ఉన్నత స్థాయికి ఎదుగుతానని విశ్వసించుకొని కష్టపడితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జి సువర్ణదేవి,డాక్టర్ స్రవంతి, శ్వేత కిశోర్, హరి ప్రసాద్, లయన్స్ క్లబ్ సిద్దిపేట అధ్యక్షుడు వినోద్ మోదాని, కార్యదర్శి వీరబత్తిని సత్యనారాయణ, ప్రతినిధులు జోజీ, రాజబహదూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపుదలే లక్ష్యం

✻ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** దేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపుదల లక్ష్యంగా పని చేయాలని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో జాతీ ఆహార భద్రత మిషన్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఎల్ఆర్‌జి52 కంది విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ ఎల్ఆర్‌జి52 కంది పంట 160170 రోజులలోనే పంట చేతికి వస్తుందని,ఎండు తెగులును తట్టుకొని, ఎకరాకు 8 నుండి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మీరాబాయి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

-నిరుపేద కుటుంబ వైద్యానికి సాయం



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** సదాశివపేట మండలం రెజిచింతల లోని నిరుపేద కుటుంబానికి చెందిన శ్వేత తన కుమారుడు ఆదర్స్ అనారోగ్యంతో పటాన్ చెరులోని ధ్రువ ఆసుపత్రిల చికిత్స కోసం ఆడ్మిట్ చేసింది. తన కుమారుడు ఆదర్స్ చికిత్సకు డబ్బులు లేకపోవడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉండగ అదే ఆసుపత్రిలో పాశ మైలారం లోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాద ఘటనలో గాయపడిన క్షతగాత్రులను పరమర్శించటానికి వచ్చిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలసి తన ఆవేదన దయనీయ గాథ ను వెల్లడించింది .శ్వేత కుమారుడు ఆదర్స్ పరిస్థితి నీ మంత్రి డాక్టర్ల ను అడిగి తెలుసుకున్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ వెంటనే చలించి ఆదర్స్ చికిత్సకు అవసరమైన డబ్బులు తన స్వయంగా చెల్లిస్తానని ఆసుపత్రి యాజమన్యానికి తెలియజేశారు. గత కొన్ని రోజులుగా ఎంతో మందిని కలిసి తన కుమారుడు చికిత్సకు సాయం చేయమని విజ్ఞప్తి చేసిన ఎవరు పట్టించుకోలేదని శ్వేత ఆవేదన చెందింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ చూపిన మానవత్వానికి ఆమె కృతజ్ఞలు తెలియజేసింది.

## మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం

-జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సిగాచి పార్మా పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ. లక్ష రూపాయాలు జిల్లా కలక్టర్ పి.ప్రావిణ్య మంగళవారం అందజేశారు. అగ్ని ప్రమాద ఘటనలో 36 మంది కార్మికులు మృతి చెందగా ఇప్పటి వరకు 13 మంది కార్మికులను గుర్తించారు. వారి మృతదేహాలను పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించి కార్మికుల కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వతరపున తక్షణ సహాయం కింద రూ. లక్ష రూపాయలు కలెక్టర్ అందజేశారు.

## శివన్న గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన



**ప్రజాపక్షం/కొండాపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల ప్రజల అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని ఆ గ్రామ పార్టీ అద్యక్షులు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. శివన్న గూడ గ్రామంలో మంగళవారం లబ్దిదారులకు మంజూరైన వారికి ప్రొసిడింగ్ లు అందజేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని వారిని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవ్వేడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్న గ్రామ పార్టీ ఉప అద్యక్షులు నాగరాజు పావని గ్రామస్థులు పాల్గొన్నారు.

## కుకునూరుపల్లి మండలాన్ని విద్యలో ఆదర్శంగా నిలుపుదాం



**ప్రజాపక్షం/కొండపాక:** ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించి కుకునూరుపల్లి మండలాన్ని ఆదర్శంగా తయారు చేద్దామని మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు.కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో సుమారు 60 మంది విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయడానికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులను ఎంఈఓ మంగళవారం శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని సమాజ భాగస్వామ్యం కూడా దీనికి అవసరమన్నారు.అందరం కలిసి మండలాన్ని ఆదర్శంగా తయారు చేద్దామని ఈ సందర్భంగా పేర్కొన్నాడు.ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, సిఆర్పి సంతోష్, ఏఐపీసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆదృశ్యం

**ప్రజాపక్షం/టేక్మాల్ :** పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశమైన సంఘటన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మ ఒడల బాచారం గ్రామానికి చెందిన రావుగారి రాములు చిన్న కుమారుడు మహేశ్ (15) హాస్టల్లో ఉంటున్నాడు .ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. జూన్ 30 తేదిన హాసల్ నుంచి పాఠశాలకు ఉదయం వేళ్ళా డు. మధ్యాహ్నం నుంచి మహేశ్ ఆచూకీ కనబడ లేదు. సాయంత్రం వరకు సైతం హాస్టల్ వెళ్ళలేదు సమాచారం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు చేరుకుని చూట్టు పక్కల బంధువుల వద్ద వెతికిన ఫలితం కనిపించలేదు. బాలుడి తండ్రి రాములు పిర్యా దు మెరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నోటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

✻ గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఉచిత దంత వైద్య శిబిరం...

✻ తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** విద్యార్థులు నోటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులు,బ్రష్,టూత్ పేస్టులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ మానవునికి సోకే అన్ని రోగాలకు కారణం దంతాలని,దంతాలను రక్షించుకుంటే అన్ని అవయవాలు రక్షించుకోవచ్చని తెలిపారు. దంతాలలో నొప్పి వస్తే అశ్రద్ధ చేయవద్దని,వెంటనే దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు. కొందరు నొప్పి వస్తే జండుబామ్ పెడుతారని,అలా చేయడం ద్వారా మొఖమంతా వాపు వస్తుందని తెలిపారు. దంతాల తోపాటు చిగుళ్లను కూడా రక్షించుకోవాలని చెప్పారు. ఆహారం తిన్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలని,రోజుకు రెండు సార్లు ఉదయం,సాయంత్రం తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌతం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విద్యాసాగర్,వైద్యులు స్పందన రాణి,నవీన్,రమ,ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి,రమేష్, షా దుల్లా,టహనుమంతరెడ్డి,స్వప్న,అనురాధ తదితరులు పాల్గొన్నారు.